క్లుప్తంగా

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సదుపాయాల కల్పనకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ డీపీటీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన శనివారం కాంప్లెక్స్‌ను సందర్శించి, స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులకు ఏయే సౌకర్యాలు అవసరమో అభిప్రాయ సేకరణ చేశామని, వారు కోరుకుంటున్న సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం


నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల కొరత లేకుండా చూశామని, రైతులకు సకాలంలో కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందివ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎరువులు, విత్తనాల కోసం రైతులు రోడ్డెక్కే పరిస్థితి కనిపిస్తోందన్నారు. మరోవైపు ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైనా రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల వారికి అన్నిరకాల అన్యాయమే జరుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ ఎందుకు ఈ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నామా అని బాధపడుతున్నారన్నారు.

సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

పాలకొండ: మండలంలోని ఎల్.ఎల్.పురం పాఠశాలలో పనిచేసి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన ఉపాధ్యాయులను అదే పాఠశాలలో శనివారం సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మజ్జి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.జయంప్రద, పి.సురేష్‌కుమార్, బి.కృష్ణారావులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జి.అప్పలనాయుడు, ఎం. చిన్నఅప్పలనాయుడు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లంఊట ధ్వంసం


బెల్లంఊటల డ్రమ్ములు చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సీతంపేట: మండలంలోని లోవగూడ పరిసరాల్లో సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల బెల్లంఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు శనివారం తెలిపారు. ఎక్కడైనా సారా తయారు చేసినా రవాణా చేసి నా విక్రయించినా సమాచారం ఇవ్వాలని, వివరాలు చెప్పిన వారి గుర్తింపు గోప్యంగా ఉంచుతామన్నారు.

భారీ వర్షం


నులకజోడు వద్ద కురుస్తున్న వాన

భామిని: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. వేకువజామున ప్రారంభమైన వాన రోజంతా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల వ్యవసాయ పనులకు వర్షం ఆటంకం కావడంతో ఆయా చోట్ల పనులు నిలిచిపోయాయి.

వితరణ


సైన్స్ పరికరాలు అందజేస్తున్న ఎంఈవో నారాయణస్వామి

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన సైన్స్ పరికరాలను అదే గ్రామానికి చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు గంటా స్వామిశేఖర్ శనివారం వితరణ చేశారు. ఎంఈవో జామి నారాయణస్వామి ఆధ్వర్యంలో రూ. 12 వేలు విలువైన సైన్స్ సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నంగిరెడ్డి శరత్‌బాబు, ఎస్.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామగ్రితో బోధన

బలిజిపేట: తరగతి గదిలో బోధనాభ్యసన సామగ్రి ఉపయోగించి బోధించడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఎంఈఓ - 1 సామల సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులందరూ నూత న బోధనా విధానాలను అమలు చేయాలన్నా రు. అకడమిక్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఇన్‌స్పైర్ మనాక్.. విద్యార్థుల సృజనాత్మకతకు వేదిక!

- ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులకు నామినేషన్
- బాలశాస్త్రవేత్తలను ప్రోత్సహించేలా ఏటా సైన్స్ పోటీలు
- నామినేషన్లకు సెప్టెంబరు 15 ఆఖరు
- జిల్లా నుంచి పోటీలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్:

విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసి, వారిని బాలశాస్త్రవేత్తలుగా రూపొందించడమే లక్ష్యంగా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దేశ వ్యాప్తంగా 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల నుంచి లక్ష సైన్స్ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కో దానికి రూ.10 వేల చొప్పున అందజేస్తారు. విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇలా అన్ని యజమాన్యాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు. ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోటీల్లో అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే ఇన్‌స్పైర్ మనాక్ 2025–26 పోటీలకు కేంద్రం తాజాగా ప్రకటన జారీ చేసింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు చేపడుతున్న ఈ కార్యక్రమానికి వచ్చే వారి నుంచి దరఖాస్తులు కోరుతోంది. సెప్టెంబరు 15వ తేదీ వరకు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు.



ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ప్రాజెక్టు సిద్ధం చేస్తున్న విద్యార్థి

ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా..

ప్రాథమిక దశలో విద్యార్థుల నుంచి శాస్త్రీయ సృజనాత్మకతను గుర్తించేందుకు, ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఇన్‌స్పైర్ మనాక్ పోటీలను ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 2 వేల పైచిలుకు విద్యార్థులు ఈ పోటీలకు నామినేషన్లు పంపించే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

వెబ్‌సైట్‌లో నమోదు ఇలా..

ఆసక్తి కలిగిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఇన్‌స్పైర్ అవార్డ్స్.జీఓవీ.ఇన్ (ఠీఠీఠీ.జీ ఃట జీజీట్బుర్ఛీ టఛీటఛీట్ట.జౌఠి.జీ ః)లో పేర్లు, వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లా అథారిటీ ఆమోదం తర్వాత విద్యార్థి మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింకు వస్తుంది. యూజర్ ఐడీకి పాస్వర్డ్‌ను క్రియేట్ చేసుకోవాలి. విద్యార్థి తన సమాచారంతో పాటు బ్యాంకు లేదా తపాలా ఖాతా, ఆధార్ నంబర్లను నమోదు చేయాలి. ఎంచుకున్న ప్రాజెక్టును సంక్షిప్తంగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవే త్తలకు రూ.25 నుంచి 50 వేల వరకు తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది.

గతంలో జిల్లా నుంచి వెళ్లిన నామినేషన్లు			
ఏడాది	నామినేషన్లు	జిల్లా స్థాయికి ఎంపికైనవి	రాష్ట్ర స్థాయికి ఎంపికైనవి
2022	897	86	9
2023	962	87	9
2024	1,005	95	10

చేయాల్సిన ప్రాజెక్టులివే..

స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, క్లీన్ ఇండియా, సమాజ అభివృద్ధి ప్రాజెక్టులు చేయాల్సి ఉంటుంది. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన అవకాశాలతో పాటు ఇంజినీరింగ్ కాలేజీ విద్యలో మెరుగైన అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటేషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఆ ఐడియా ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, ఆలోచనకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించి బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబర్, ఎంటర్ చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపరిచి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతను సంబంధించి అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు.

శాస్త్రవేత్త అవ్వడానికి మంచి అవకాశం..



విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికి తీసి, శాస్త్రవేత్తగా ఎదగడానికి ఇదొక మంచి అవకాశం. పోటీల్లో విద్యార్థులంతా పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవతీసుకోవాలి. జిల్లా నుంచి అధికంగా నామినేషన్లు నమోదయ్యేలా చూడాలి.

–బి.రాజ్‌కుమార్, జిల్లా విద్యా శాఖాధికారి, పార్వతీపురం మన్యం

పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుంది..



విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి, సరికొత్త ఆవిష్కరణలపై ఉత్సుకత పెరుగుతుంది. ఈ ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయి. గతంలోనూ మన విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా జాతీయ స్థాయిలో స్థానం సాధించేలా ప్రాజెక్టులు సిద్ధం చేయిస్తున్నాం.

–గిరడ లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించండి

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని ఎండీఎం(మధ్యాహ్న భోజనం) నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు తెలిపారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సామూహిక వంటశాలల విధానం ద్వారా మండలానికి ఒక్క వంటశాల మాత్రమే ఏర్పాటు చేయాలన్న ఆలోచన విరమించుకోవాలన్నారు. అలాగే ఎండీఎం నిర్వాహకులకు కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని, ప్రతినెలా ఐదో తేదీలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 3వ తేదీన పార్వతీపురంలో మహాసభ ఉంటుందని, సెప్టెంబరు 13, 14 తేదీల్లో పాలకొండలో.. డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో ఈ మహాసభలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకుల సంఘం నాయకులు బారమ్మ, ఉషా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు

జీవామృతం తయారీపై అవగాహన



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

భామిని: మండలంలోని పక్కుడుబద్రలో జీవామృతం తయారీపై ఏపీసీఎన్‌ఎఫ్‌లు బి.మోహనరావు, పి.అరుణలు శనివారం అవగాహన కల్పించారు. అనంతరం పంటలపై జీవామృతం పిచికారీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, అలాంటప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం రూపొందుతుందన్నారు. ప్రకృతి సేద్యం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ సీవోలు కె.శారద, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొట్టిన అంగన్‌వాడీ కార్యకర్త

సాలూరు: పట్టణంలోని వేద సమాజం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొట్టడంపై సీడీపీఓ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేయగా.. కార్యకర్త గంట్రెడ్డి గౌరి లేరు. ఆమె సెలవు పెట్టారా అని సూపర్‌వైజర్ ధనలక్ష్మిని అడగ్గా.. సెలవు పెట్టలేదని, సెలవు చీటీ కూడా ఇవ్వలేదని చెప్పారు. సెలవు పెట్టుకుండా విధులకు డుమ్మా కొట్టడం సరికాదని సీడీపీఓ అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం చిన్నారుల తల్లులతో మాట్లాడి పలు వివరాలు సేకరించారు.


చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి


ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, విద్యార్థులు

శృంగవరపుకోట: పట్టణంలోని వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నేతృత్వంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈతరుణంలో పట్టణ పోలీసులు పర్మిషన్లు లేవంటూ ర్యాలీని ఆపేప్రయత్నం చేసినా విద్యార్థులు గట్టిగా ప్రతిఘటించటంతో పోలీసులు మిన్నకున్నారు. అనంతరం విద్యార్థులు హాస్టల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబా బు మాట్లాడుతూ ఎస్.కోట ఎస్టీ బాలుర వసతి గృహంలో అదనపు గదులు, అదనపు మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.ఎస్‌ఎఫ్‌ఐ నేతలు పి.రమేష్, భారతి, రత్న, అనిత, చరణ్, తిలక్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నర్సిపురం, ఎమ్మార్‌నగర్, బందలుప్పి 11 కేవీ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతున్న గ్రామాలతో పాటు వైకేఎం కాలనీ, వెంకంపేట, అఫీషియల్ కాలనీ, వసుంధరానగర, తదితర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ రామారావు శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు

గరుగుబిల్లి:

ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లఖనాపురంలో శనివారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన..అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్న తీరును క్షుణ్ణంగా వివరించారు. అలాగే అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు, ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. ఎన్నికల సమయంలో అధికారమే పరమావధిగా అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను ఊదరగొట్టి, తీరా అధికారంలోకి వచ్చాక హామీల అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్యన్నారు. హామీలకు తమది గ్యారెంటీ అని చంద్రబాబు, పవన్‌లు సంతకాలు చేసిన బాండ్‌లను కూడా ఇంటింటికీ ఇచ్చారని, వాటిని అమలు చేయాలని అడిగితే ఏ ఒక్కరూ కనిపించడం లేదన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన ఒకట్రెండు పథకాల్లోనూ ప్రజలకు మోసమే జరిగిందన్నారు. ఎన్నికలప్పుడు ఏడాది నాలుగు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి, ఇప్పుడు ఏడాదికి మూడే ఇస్తున్నారని అది కూడా కొంతమందికి డబ్బులు పడడం లేదన్నారు.

మిగతా పథకాలేవీ?

ఇటీవల ఇచ్చిన తల్లికి వందనం పథకంలోనూ అర్హులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి, గతంలోని లబ్ధిదారుల డేటా ఆధారంగా కేవలం రూ.13 వేలు వేశారన్నారు. అందులోనూ చాలా మంది తల్లుల ఖాతాల్లో ఇప్పటికీ డబ్బులు జమ కాలేదన్నారు. లబ్ధి పొందిన వారిలో ఒక్కొక్కరికి ఒక్కో రకంగా డబ్బులు పడ్డాయన్నారు. ఒకరికి రూ.13 వేలు పడితే మరొకరికి రూ.10 వేలు, రూ.8 వేలు ఇలా పడ్డాయన్నారు. అరకొరగా రెండు పథకాలు అమలు చేసేసి మొత్తం పథకాలు అమలు చేసేసినట్లు గొప్పలు చెప్పుకోవడం దారుణమన్నారు. కూటమి వ్యవహారం చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఎక్కడన్నారు. ఇవన్నీ అమలు చేశారా అని నిలదీశారు. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కూటమి ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయించి, ప్రజలకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిలి గౌరునాయుడు, తోటపల్లి దేవాలయ మాజీ చైర్మన్ ఎం.సత్యనారాయణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: గ్రామస్థాయిలో ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వివరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించండి


అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను త్వరగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడారు. గతంలో ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమితులైన ఏఎన్‌ఎంలు ఉండడం ద్వారా గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాగుండేదని, ఇప్పుడు వారు లేకపోవడంతో విద్యార్థుల ఆకస్మిక మరణాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ఇవ్వడమే కాదని, మెరుగైన ఆరోగ్య భరోసాను కూడా ఇవ్వాలని హితవు పలికారు. ప్రభుత్వానికి విద్యార్థుల సంక్షేమం, భద్రత పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఏఎన్‌ఎంల నియామకం చేపట్టాలన్నారు. ధర్నా చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలన్నారు.

సాలూరులో కార్డన్ సెర్చ్

సాలూరు: ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు పట్టణంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్, బంతి స్టేడియం, ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలు, డబ్బివీధి, చెరువు గట్టు, తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.

ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామంలో పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషకుమారి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎనిమిది లీటర్ల సారా పట్టుబడిందని ఎస్సై తెలిపారు.

ప్రమాదకరంగా మర్రిచెట్టు

వీరఘట్టం: మండలంలోని సీఎస్పీ రోడ్డులో బొడ్లపాడు జంక్షన్‌లోని మర్రిచెట్టు ప్రమాదకరంగా ఉంది. చెట్టు పక్కనే గ్రామానికి వెళ్లే దారి ఉండగా చెట్టు అడ్డుగా ఉండడంతో దగ్గరకు వెళ్తే తప్ప దారి కనిపించడం లేదు. దీంతో ఇదే రోడ్డులో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుని, పలువురు గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి, చెట్టు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బొడ్లపాడు జంక్షన్ వద్ద గ్రామ రోడ్డు కనిపించకుండా ఆక్రమించిన మర్రిచెట్టు



చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


యువతకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే మనకు మంచి గుర్తింపు ఉంటుందని ఎల్విన్‌పేట సీఐ బి.హరి అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని దుమ్మంగి గ్రామంలో సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి పర్యటించిన ఆయన..గ్రామస్తులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ మంచి నడవడిక అలవర్చుకోవాలని, చెడు అలవాట్లు బారినపడి జీవితం నాశనం చేసుకోవద్దని తెలిపారు. ముఖ్యంగా యువతీ యువకులు బాగా చదువుకుంటూనే క్రీడల్లో కూడా బాగా రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎంతోమంది జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. అనంతరం ఆ గ్రామ యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.